


# పొరుగింటి పుల్లకూర?!

## అనుభవాల కలంనుంచీ అనేక విషయాలు



ఇప్పుడుప్పుడు అణ్వస్త్రాల గురించి పేపర్లలో చర్చలు జరుగుతున్నాయి. అమెరికా, రష్యా, ఆస్ట్రేలియాల గొంతులు వినిపిస్తున్నాయి. ప్రపంచ చరిత్రలో ఇంతవరకు ఒకే ఒక్కసారి - భయంకరమైన పరిణామంతో అణ్వస్త్ర ప్రయోగం జరిగింది - జపాన్‌లో హిరోషిమా, నాగసాకీల మీద. మానవాళి అప్పటికీ ఇప్పటికీ నిశ్చేష్టమయిపోయింది. దాదాపు 60 సంవత్సరాల తర్వాత ఇప్పటికీ ధార్మిక శక్తి ప్రభావానికి విచ్ఛిన్నమయిపోతున్న జీవితాలు అక్కడ కనిపిస్తాయి. మా పెద్దబ్బాయి, మనుమలూ ఆ మధ్య హిరోషిమా వెళ్ళారు. ఆ తర్వాత నాగసాకీ వెళ్ళడానికి ధైర్యం చాలలేదన్నారు. మా మనుమరాలు నాకా భయంకరమయిన సంఘటనలు చెపుతూ ఏడ్చేసింది.

అయితే - ఇది ఒక వేపు నుంచీ చూస్తే కనిపించే దృశ్యం. ఈ 60 సంవత్సరాలలో - ఓ చిన్న ద్వీపంలో ఉన్న జపాన్ ప్రపంచ దేశాలన్నిటినీ తలదన్నే పురోగతిని సాధించింది. ఎలక్ట్రానిక్ రంగంలో అయితే అమెరికా, ఫ్రాన్స్, అరబ్ దేశాలలో కూడా జపాన్ లేబులే ఉంటేనే నమ్మకం, మన్నిక. ఏమిటి ఈ జాతి రహస్యం? నడుం విరిగే విధ్వంసాన్ని తట్టుకుని గోమటేశ్వరుడిలాగ ఆకాశంలోకి దూసుకుపోవడానికి ఈ జాతికున్న ప్రత్యేకత ఏమిటి?

ప్రముఖ హాలీవుడ్ తార షిర్లీ మాక్లయిన్ జపాన్‌లో పెరిగిన అమెరికన్‌ని పెళ్ళిచేసుకుంది. ఆమె ఆత్మకథలో జపాన్ ప్రసక్తి వింటే - ఆ ప్రశ్నకి అర్థం బోధపడుతుంది. (మన గురించి మనవాళ్ళు చెపితే గొప్పతనం ఏముంది? పొరుగింటి వాళ్ళు చెప్పాలి.)

జపాన్‌లో అర్జంటు పనుల్లేవు. అక్కడ ముఖ్యమైన విషయం మనిషికీ మనిషికీ ఉన్న సంబంధాలు. వీలయినంత వరకు, వీలయినప్పుడల్లా 'వత్తిడి'ని వదులుకోవాలి. పడమటి దేశాల్లో మర్యాదలకి ఓ విలువుంది. కానీ జపాన్ మర్యాద ఓ కళ. దాన్ని వారు ఆరాధిస్తారు. ఇద్దరు కలిసినప్పుడు చిరునవ్వు దగ్గర్నుంచీ, శరీరంతో వంగి పలకరించడం వరకు - ఆ పని వారి సంస్కృతిలో భాగం. కేవలం మర్యాద కాదు. ప్రకృతికి ఒదిగి బ్రతుకుతారు. లొంగదీసుకోడానికి ప్రయత్నించరు. "వెదురుని చూసి పాఠం నేర్చుకో. గాలితో పాటు, గాలి కంటే ముందు వొంగు. తలవొంచు. ఎప్పటికీ వీగిపోవు" ఇది సామెత. తలవొంచడం ఓటమికి చిహ్నం కాదు. గెలుపుకి దగ్గర త్రోవ. నీటినీ, అడవుల్నీ, చెట్లనీ అదుపులో ఉంచాలని చూడరు. కాగితాన్ని కూడా 'కళ'గా మలచిన సంస్కృతి అది.

అతి ముఖ్యమయిన విషయం. అక్కడ మంచికీ, చెడుకీ మధ్య పెద్దవార లేదు. అన్నివేపుల నుంచీ సమస్యని గమనిస్తారు. తగాదా వస్తే మధ్యవర్తిని ఆశ్రయిస్తారు. మంచికి పట్టం కట్టమని కాదు. ఎవరికీ ఇబ్బంది కలగని రీతిలో - అవసరమయితే మంచిని ఆ మాత్రం రాజీ చేసి ఓ "సంయమనం" ఏర్పరచడానికి. ఇదెంత గొప్ప విషయం!

అర్జంటు పరిష్కారాల్ని అనుమానంతో చూస్తారు. ఫలితం కన్న ఎంచుకున్న మార్గం ముఖ్యం. (ఈ మాట మహాత్ముని గొంతులో మనం విన్నాం)

మరొక అద్భుతమయిన విషయం. మనిషి బాగా ఆలోచించాలి, ధ్యానంలో ఉండాలంటే కడుపులో ఏ మూలో కాస్త 'ఆకలి' మిగలాలి. పూర్తిగా వెచ్చదనం, ఖుషీ జీవితం తగదు. అవసరమయింది కాస్త వదులుకోవడం ద్వారానే జ్ఞాన ప్రదీపన సాధ్యం. ఇది బౌద్ధం. డబ్బున్నవాడు కూడా 'ఉండాలి కనుక' అని ఏదీ కొనడు. సంపన్నుడి గొప్పదనం సాధించిన వాటిలో తప్ప కూడ బెట్టిన వాటిలో చూసుకోడు.

ఇక సరదా అయిన విషయాలు. హోటల్ క్లర్క్‌ని "ఫలానా మనిషి దగ్గర్నుంచీ ఫోనొచ్చిందా?" అనడిగిందట షిర్లీ. రాలేదని సమాధానం. తర్వాత పదిహేను మంది పంపిన సందేశాల లిస్టు వచ్చింది. "మరి చెప్పలేదేం?" అంటే "మీరు అడగలేదు కదా?" అని సమాధానం.

టెలీఫోన్‌లో మాట్లాడుతున్న జపాన్ మనిషిని పలకరించండి. రిసీవర్ పక్కన పెట్టి ఎంతసేపయినా మాట్లాడతాడు - అవతల మనిషి ఫోన్‌లో వేచి ఉన్నా. ఎందుకు? మిమ్మల్ని కించపరచకపోవడం మర్యాద.

ఓ చిన్న పనికి పది రూపాయలు (ఉదాహరణకి) ఇచ్చి పంపింది. నిజానికి ఆ పనికి రెండు రూపాయలు చాలు. ఈలోగా ఏదో పని మీద నగరంలో మరో మూలకి వెళ్ళాల్సి వచ్చింది. కొన్ని గంటల తర్వాత ఆ కుర్రాడు ఆమెను వెదుక్కుంటూ ఆ మూలకి వచ్చి ఎనిమిది రూపాయలు ఇచ్చి వెళ్ళిపోయాడు!

ఒక పత్రికా ప్రతినిధి ఆమెని 'టీ'కి ఆఫీసుకి ఆహ్వానించాడు. మధ్యలో లేచి బయటికి వెళ్ళాడు. 45 నిమిషాలు గడిచినా తిరిగి రాలేదు. ఆయన కోసం బయటికి వస్తే వరండాలో అద్భుతంగా ఏర్పాటు చేసిన పుష్పాల అలంకరణ ముందు మోకరిల్లి ఉన్నాడు. ఆ దృశ్యం చూడగానే అతనిలో పరవశం కలిగింది. మనస్సు ప్రశాంతమయింది. ప్రశాంతత కన్నా ముఖ్యమైనది మరొకటి లేదు. ధ్యానం గొప్ప ఉపశమనం.

రోడ్డు మీద నూడుల్స్ బండి వెళ్తోంది. టాక్సీ దాన్ని గుద్దుకుంది. నూడుల్స్ సరుకంతా చిందర వందరయింది. బండీ, బండి వాడూ ఎగిరి నేలమీద పడ్డారు. టాక్సీ డ్రైవరు దిగాడు. కారుకి పెద్ద లొట్ట అయింది. బండివాడికి దెబ్బలు తగిలాయి. లేచాడు. ఇద్దరూ ఒకరి ముందు ఒకరు వంగి క్షమాపణలు చెప్పుకున్నారు. అంతే. టాక్సీ డ్రైవరు కారు నడుపుకు వెళ్ళిపోయాడు. నేల పాలయిన నూడిల్స్‌ని కాలువలోకి తోసి బండివాడు కుంటి బండితో తన దారిన పోయాడు! మర్యాదకి మన్నన లభించింది. మరి నష్టం? ఇది అమెరికా కాదు - కోర్టెక్కడానికి. ఇండియా కాదు జుత్తు పట్టుకోవడానికి.

ఇద్దరు రోడ్డుమీద నడుస్తున్నారు. ఒకడు ముతక జోక్ చెప్పాడు. రెండోవాడికి నవ్వొచ్చింది. అంతలో అవసరం వచ్చింది. పక్కకి తిరిగి మూత్ర విసర్జ చేస్తున్నాడు. వెనుక నడుస్తున్న స్త్రీ ఏమీ చూడనట్టు నడుచుకుపోయింది. జపాన్‌లో ఎవరయినా తాము చూడాలనుకున్నదే చూస్తారు. చూడక్కరలేనిది చూపు నుంచీ జారిపోతుంది.

ఒకాయన రోడ్డు మీద పడ్డాడు - అనారోగ్యంతో ఎవరూ అతని గురించి పట్టించుకోలేదు. ఎందుకని? అతని కర్మ ముందే నిర్ణయించబడింది..అనుభవిస్తున్నాడు. అక్కరకు వెళితే ఆ కర్మకి మనం అడ్డుపడినట్టు. దానికి ఫలితం మనం బతికినంత కాలం అనుభవించాలి. ఈ విషయం పడిన వాడికీ తెలుసు. చేయూతనివ్వని వాడికీ తెలుసునని పడిన వాడికి తెలుసు.

ఈ ఒక్క విషయంలో - ఇంకా మనం 'కాస్త ముందు' ఉన్నామేమో! అది మన 'కర్మ'

******